## క్లుప్తంగా

### ఆలయాల నిర్మాణాలకు విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

**కేశంపేట:** మండలంలోని పాటిగడ్డ, పుట్టోని గూడ గ్రామాల్లో దేవాలయాల నిర్మాణాలకు మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి విరాళం అందజేశారు. పాట్టిగడ్డలోని పోచమ్మ దేవాలయ నిర్మాణానికి లక్ష రూపాయాలు, పుట్టోనిగూడ శ్రీఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి మరో లక్ష రూపాయాలు విరాళం గురువారం ఆలయ కమిటీ సభ్యులకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో పుట్టోనిగూడ సర్పంచ్ జగన్‌నాయక్, ధన్‌రాజ్‌రెడ్డి పాల్గొన్నారు.

### ప్రభుత్వ పథకాలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న మేనేజర్ సుధీర్‌కుమార్

**కొందుర్గు:** ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చౌదరిగూడ ఏపీజీవీబీ మేనేజర్ సుధీర్‌కుమార్ సూచించారు. గురువారం జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని పెద్ద ఎల్కిచర్లలో సర్పంచ్ భూపాలచారి అధ్యక్షతన అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, జీవనజ్యోతి, పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయా పథకాలపై వివరంగా తెలిపారు. కార్యక్రమంలో మహిళా సంఘాల నాయకులు మంజుల, విజయ, సువర్ణ, జంగమ్మ, లక్ష్మి, అనిత, వెంకటమ్మ పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలి



విరాళం అందజేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

**శంకర్‌పల్లి:** అయ్యప్ప దేవాలయం నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, శంకర్‌పల్లి మాజీ ఉప సర్పంచ్ సాత ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని మహాలింగపురం గ్రామానికి చెందిన ఎం. రాఘవేందర్‌రెడ్డి రూ. 1లక్ష 1వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు. గ్రామాల్లో అయ్యప్ప ప్రచారం రథం తిరుగుతుందని, ప్రతి ఒక్కరు తమ కుటుంబం నుంచి వచ్చి విరాళాలను, కానుకలను అందించాలని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ యువజన విభాగం అధ్యక్షుడు పాండురంగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

### నేడు సీసీ కెమెరాల ప్రారంభం

**కొత్తూరు:** పట్టణంతో పాటు ఆయా కూడళ్ల వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శుక్రవారం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ప్రారంభించనున్నట్లు ఎస్ఐ శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఏర్పాటు చేసిన కెమెరాల స్థానంలో ప్రస్తుతం అత్యాధునిక సాంకేతికతతో కూడిన కెమెరాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమానికి ఏసీపీ కుశాల్కర్, శంషాబాద్ ఏసీపీ భాస్కర్‌లు హాజరు కానున్నట్లు తెలిపారు.

### రైల్వేగేటు వద్ద అండర్‌పాస్ నిర్మించాలి

**కొత్తూరు:** మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీ రైలు పట్టాల వద్ద అండర్‌పాస్ వంతెన నిర్మించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగరాజుచారి గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఇక్కడ పట్టాలు దాటే క్రమంలో రైళ్ల రాకపోకల కారణంగా గేటు పడడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ రోడ్డు నుంచి ఆయా గ్రామాలకు ప్రజలు రాకపోకలు సాగుతుంటాయని తెలి పారు. అత్యవసర సమయాల్లో గేటు వేస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అండర్‌పాస్ నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

### ఇంటి నిర్మాణానికి చేయూత

**తలకొండపల్లి:** మండలంలోని చంద్రధన గ్రామానికి చెందిన ఆంజనేయులు ఇటీవల ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఆర్థిక ఇబ్బందులు కారణంగా పనులు ఆపేశాడు. ఉప సర్పంచ్ సుధాకర్ సహకారంతో జెడ్పీటీసీని కలిసి ఆర్థిక సహాయం చేయాలని కోరారు. స్పందించిన ఆయన ఉప్పల ట్రస్టు సభ్యులతో ఆంజనేయులు ఇంటి నిర్మాణానికి సిమెంట్, స్టీల్, ఇసుక తదితర సామగ్రిని గురువారం అందజేశారు.

# బస్టాపుల్లో షెల్టర్ల నిర్మాణం ఎన్నడో?

- ఎండావానలకు ఇబ్బందుల్లో ప్రయాణికులు
- షెల్టర్లు లేకపోవడంతో రోడ్లుపై నిల్చుంటున్న విద్యార్థులు, ప్రయాణికులు



అమ్డాపూర్ చౌరస్తాలో రోడ్డుపై ప్రమాదకరంగా నిల్చున్న ప్రయాణికులు

**మొయినాబాద్ రూరల్ :** బస్టాపుల్లో బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు ఎండ, వానాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూర్చుందామన్నా కూర్చీలు కాదు కదా! నిల్వని నీడ లేని పరిస్థితి నెలకొంది. హైదరాబాద్ -బీజాపూర్ ప్రధాన రహదారిపై ఉన్న పోలీస్ అకాడమీ అప్పా మొదలుకొని తోల్‌కట్ట బస్టాపు వరకు ఆయా గ్రామాల చౌరస్తాల్లో బస్టాపులు ఉన్నా బస్ షెల్టర్లు లేవు. దీంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు గంటల తరబడి ఎండలో నిల్చుని ఇబ్బందులు పడుతున్నారు. అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, మొయినాబాద్, కనకమామిడి, కేతిరెడ్డిపల్లి, తోల్‌కట్టల గ్రామాల చౌరస్తాల్లో బస్టాపుల్లో బస్ షెల్టర్లు కరువయ్యాయి. దీంతో ప్రయాణికులు రోడ్లపై నిల్చుని బస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. మొయినాబాద్ మండల పరిధిలో అనేక ఇంజనీరింగ్ కళాశాలలు, పలు మెడికల్ కళాశాలలు, డెంటల్ కళాశాలలతో పాటు ప్రైవేటు, ప్రభుత్వం పాఠశాలలు ఉన్నాయి. జంట నగరాల నుంచి విద్యార్థులు ఈ ప్రాంతాలకు వచ్చి వెళ్తుంటారు. బస్టాపుల్లో కనీస బస్ షెల్టర్లు లేకపోవడం శోచనీయమని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సంబంధిత అధికారులు బస్టాపులను పరిశీలించి బస్ షెల్టర్లను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

#### షెలర్లు ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంలో ఉన్న ఆయా గ్రామాల చౌరస్తా వద్ద బస్ షెల్టర్లను ఏర్పాటు చేయాలి. ప్రయాణికులు రోడ్లపై ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి

– మొయినాబాద్ మండల, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దర్గా మహేందర్

#### ఇబ్బందుల్లో ప్రయాణికులు



మండలంలోని బస్టాపుల్లో బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు ఎండనక వాననక ఇబ్బందులు పడుతున్నారు. కూర్చుందామన్న కూర్చీ కాదు కనీసం నీడ కూడ లేని పరిస్థితి నెలకొంది. అజీజ్‌నగర్, అమ్డాపూర్, హిమాయత్‌సాగర్‌లతో పాటు మొయినాబాద్ బస్టాపుల్లో బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు రోడ్లపై నిల్చుంటున్నారు. ప్రభుత్వం రోడ్డు ప్రక్కన బస్ షెల్టర్లను ఏర్పాటు చేయాలి

– యాదగిరి ముదిరాజ్, చిల్కూరు

#### బస్సుల కోసం రోడ్లపైనే అవస్థలు



మొయినాబాద్‌లోని జాతీయ రహదారి హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై ఉన్న అజీజ్ నగర్ చౌరస్తా, హిమాయత్ నగర్, అమ్డాపూర్, మొయినాబాద్, కనకమామిడి, తోలుకట్ట గ్రామాల చౌరస్తాల్లో బస్టాపులు లేక రోడ్లపైనే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా అజీజ్‌నగర్ చౌరస్తా, తోలుకట్ట చౌరస్తాలో బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు బస్సుల కోసం రోడ్లపైనే నిలబడి ఉంటున్నారు. దీంతో ప్రమాదాలకు గురవుతున్నారు.

–బీసా నర్సింహ్మా, హిమయత్‌నగర్

# ఎంసెట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

- 26 మంది విద్యార్థుల ఉత్తీర్ణత
- జేఈఈ మెయిన్స్‌కు ఎంపికైన విద్యార్థి

**చేవెళ్ల:** ఎంసెట్ ఫలితాల్లో చేవెళ్ల ఆదర్శ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రభుత్వం గురువారం విడుదల చేసిన ఫలితాల్లో ఆదర్శ కళాశాలకు చెందిన 26 మంది విద్యార్థులు ఎంసెట్‌లో ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ కళాశాలల్లో కూడా ప్రైవేటు పాఠశాల కంటే మెరుగైన ఫలితాలను సాధిస్తారని ఆదర్శ కళాశాల నిరూపించింది. ఈ సందర్భంగా ఎంసెట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ టేనావతి, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంతంలో ఉంటు ప్రభుత్వ కళాశాలలో చదువుకున్న పేదకుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యార్హత పరీక్షల్లో కూడా రాణిస్తున్నారని చెప్పారు. ఇదే పట్టుదలతో ముమ్ముందు మరింత మెరుగైన ఫలితాలను సాధించాలని తెలిపారు.

**ఎంసెట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు**

ఎంసెట్ ఫలితాల్లో ఆదర్శ కళాశాలకు చెందిన ఎంపీసీ గ్రూప్‌కు చెందిన 18 మంది విద్యార్థులు, బైపీసీకి చెందిన 8 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. మండలంలోని కమ్మెట గ్రామానికి చెందిన రైతు తలారి సత్తయ్య, సావిత్రల కుమార్తె టి. పవిత్ర బాసర ట్రిపుల్‌ఐటీలో బీటెక్ చదువుతుంది. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు చేవెళ్లలోని ఆదర్శ కళాశాలలో చదువుకుంది. ఐఐటీలో జేఈఈ మెయిన్స్‌కు ఉత్తీర్ణత సాధించింది. ఎంసెట్‌లో కూడా 11,6,937 ర్యాంకు సాధించింది.

# 'కంటివెలుగు'తో దృష్టి సమస్యలు దూరం

సర్పంచ్ నరహరిరెడ్డి



కంటి అద్దాలను అందజేస్తున్న నరహరిరెడ్డి, వైద్యాధికారులు తదితరులు

**చేవెళ్ల:** కంటి వెలుగుతో గ్రామాల్లోని ప్రజల కంటి సమస్యలు దూరమవుతున్నాయని దేవరంపల్లి సర్పంచ్ నరహరిరెడ్డి అన్నారు. మండలంలోని దేవరంపల్లిలో గురువారం కంటివెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నరహరి రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. గ్రామంలోని ప్రజలందరికీ కంటి పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఉచితంగా పరీక్షలు చేయడంతో పాటు కళ్ళద్దాలు, మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ మల్లేశ్, వార్డు సభ్యులు, కంటి వెలుగు వైద్య సిబ్బంది డాక్టర్ సంగీత, అబ్దుల్ అథిక్, పాలమ్మ, శివరాజు, మల్లేశ్, ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

**'కంటి వెలుగు'తో ప్రయోజనం**

**కొందుర్గు:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ రాణి అన్నారు. గురువారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం, జాకారంలో ఆమె కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్వేత కంటి రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఉచితంగా అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఎ శ్రీలత, ఏఎన్ఎం సునిత, ఆశ, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్రీడల్లో గెలుపోటములు సహజం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న విజయ్‌కుమార్

బీజేపీ నాయకుడు తులసిరామ్ విజయ్‌కుమార్

**షాబాద్:** దివంగత నేత మాజీ పార్లమెంట్ సభ్యులు వర్రీ తులసిరామ్ స్మారకార్థం నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయని నియోజకవర్గం బీజేపీ నాయకుడు వర్రీ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీఆర్ఆర్ మినీ స్టేడియంలో వర్రీ తులసిరామ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఆయన ప్రారంభించారు. నాలుగు రోజుల పాటు క్రికెట్ పోటీలు జరుగుతున్నట్లు తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు మొదటి బహుమతి రూ.50 వేలు నగదు, రెండవ బహుమతి రూ. 25వేలు నగదు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. క్రీడాకారుల్లోని నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇలాంటి క్రీడాపోటీలు ఎంతో దోహదపడుతాయన్నారు. గ్రామాల మధ్య స్నేహ సంబంధాలను పెంచేందుకు క్రీడలు ఉపయోగపడతాయని తెలిపారు. గెలుపోటములు సమానంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్, శంకర్‌పల్లి అధ్యక్షుడు రాములుగౌడ్, టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్, యువమోర్చా జిల్లా కార్యదర్శి కూతురు మహేందర్, ప్రభాకర్‌రెడ్డి, రాజాసింగ్‌గౌడ్, రమేష్, కర్ణాకర్‌రెడ్డి ఉన్నారు.

## నేటి నుంచి ఈదమ్మ జాతర

**దౌల్తాబాద్:** ఈదమ్మ జాతర శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు జరగనుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం జల్దిబిందె, సాయంత్రం బోనాల కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు రెట్టపట్ల కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ ఉత్సవాలకు కర్నాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకానున్నారని తెలిపారు.

## బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేస్తే జరిమానా

**కుల్కచర్ల:** బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేస్తే జరిమానా తప్పదని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో పలు దుకాణ దారులు ఆరుబయట చెత్తవేయడంతో వారికి నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కడ పడితే అక్కడ చెత్తవేయరాదని, గ్రామపంచాయతీ ట్రాక్టర్లోనే చెత్త వేయాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానా విధిస్తామన్నారు.

# పద్మశాలి మండల కమిటీ ఎన్నిక



నూతనంగా ఎనికైన మండల పద్మశాలి కమిటీ సభ్యులు

**కేశంపేట:** పద్మశాలి సంఘం మండల కమిటీని గురువారం మండల కేంద్రంలో ఎంపిక చేశారు. నూతన మండల కమిటీ అధ్యక్షుడిగా పల్లాటి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా గోస్కె నర్సింలు, పల్లాటి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా గంజి కృష్ణయ్య, కోశాధికారిగా సుధాకర్, కార్యవర్గ సభ్యులుగా లింగం, రంగయ్య, వెంకటేశ్, శ్రీనివాసులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. పద్మశాలిల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. త్వరలోనే గ్రామాల్లో పద్మశాలిలతో సమావేశాలను నిర్వహిస్తామని తెలిపారు. పద్మశాలిలు ఐకమత్యంగా ఉండి అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో సురేందర్, రామకృష్ణ, రాఘవేందర్, రవీందర్, శ్రీను, శివనందు, రమేష్, శీనయ్య పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను పరామర్శించిన ఎర్రబెల్లి



పద్మమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఎర్రబెల్లి తదితరులు

**ఇబ్రహీంపట్నం రూరల్:** ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాతృమూర్తి మరణం ఆ కుటుంబానికి తీరని లోటని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఇటీవల ఎమ్మెల్యే మాతృమూర్తి చనిపోయిన విషయం తెలుసుకున్న మంత్రి గురువారం మండలంలోని ఎల్మినేడు గ్రామానికి వచ్చి పద్మమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ఎమ్మెల్యేను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి, ఎంపీపీ కృపేష్, వైస్ ఎంపీపీ మంచి రెడ్డి వెంకట ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ ఏ అశోకవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు .

# ప్రమాద బాధితులను ఆదుకోవాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్

**యాచారం:** పనులకు వెళుతూ ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదానికి గురైన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కే భాస్కర్ డిమాండ్ చేశారు. ప్రమాదంలో గాయపడి నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని గురువారం ఆయన పరామర్శించారు. ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఔటర్ రింగ్ రోడ్డుపై మొక్కల పెంపకం చేపట్టే కార్మికులంతా పేదవారేనని అన్నారు. క్షతగాత్రులకు ప్రభుత్వం తక్షణ వైద్య ఖర్చుల నిమిత్తం రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం చేయాలని కోరారు.

# పీపుల్స్ మార్చ్‌కు కాంగ్రెస్ శ్రేణులు



పీపుల్స్‌మార్చ్‌కు తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

**షాద్‌నగర్‌రూరల్:** సీఎల్పీ నేత భట్టివిక్రమార్క చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర గురువారం జడ్చర్ల నియోజకవర్గంలో కొనసాగింది. ఈ సందర్భంగా పట్టణం నుంచి పీసీసీ కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు భారీ ఎత్తున తరలివెళ్లారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో కొనసాగుతున్న అవినీతి పాలనను ప్రజలకు తెలియజేసేందుకే కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర చేపట్టిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల పక్షాన పోరాడాలని పిలుపునిచ్చారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



షాద్‌నగర్‌రూరల్: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

**మొయినాబాద్‌రూరల్:** మండలంలోని కనకమామిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98 ఎస్ఎస్‌సీ బ్యాచ్ 25 సంవత్సరాల తరువాత మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి సమీపంలోని పావని రిసార్ట్‌లో పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించి పాదాభివందనం చేసుకున్నారు. గురువులు నేర్పిన విద్యాబుద్ధులే నేడు పలు ఉద్యోగ, వ్యాపార అభివృద్ధిలో కొనసాగుతున్నామని గుర్తు చేశారు. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకొని సంతోషించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక**

**షాద్‌నగర్‌రూరల్:** సర్దార్‌నగర్ జెడ్పీహెచ్ఎస్‌లో 1998–99లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 25సంవత్సరాల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఎంతో ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఇన్నేళ్ల తరువాత ఒకే వేదికపై కలుసుకొని అంతులేని ఆనందాన్ని పొందామని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో గురువులు అడివప్ప, ప్రతాప్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, చారి, ముస్తఫా, నారాయణరెడ్డి, ఇక్బాల్, లింగం, షమీమ్, పూర్వ విద్యార్థులు శ్రీశైలం, రాజు, నర్సింలు, ఇంద్రారెడ్డి, సునీల్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## పేదలకు వరం కల్యాణలక్ష్మి

**దౌల్తాబాద్:** పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి పథకం ఓ వరం లాంటిదని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులు ఎమ్మెల్యే పంపిణి చేసి మాట్లాడారు. ఆడపిల్ల పెళ్లి తల్లిదండ్రులకు భారం కావొద్దని ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.లక్ష 116 సాయంగా అందజేసి పెద్ద దిక్కుగా నిలుస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ మహిపాల్, వైస్ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ శిరీష, డీటీ చాంద్‌పాష, నాయకులు మోహన్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, జాకీరఅలీ తదితరులు పాల్గొన్నారు.

## తాలు లేకుండా ధాన్యం తేవాలి

**తలకొండపల్లి:** మండలంలోని చుక్కాపూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏవో రాజు, ఏఈఓ శ్రీనాథ్ గురువారం సందర్శించారు. కొనుగోలు కేంద్రానికి రైతులు తెచ్చిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగ ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. తేమ 17శాతం కంటే తక్కువగా ఉండేలా చూసుకోవాలన్నారు. అలాగే తాలు, చెత్త, మట్టి, లేకుండా నాణ్యమైన పంటను కొనుగోలు కేంద్రాలకు తెచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యువతను ప్రోత్సహించేందుకే క్విజ్

డీసీసీ అధ్యక్షుడు టి. రామ్మోహన్ రెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

**దోమ:** యువతను అన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్ పోటీలు నిర్వహిస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు టి. రామ్మోహన్ రెడ్డి చెప్పారు. గురువారం తిమ్మాయిపల్లి గ్రామంలో 'రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్' సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, యువతీ యువకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పోటీలకు 16 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగిన వారు అర్హులన్నారు. ఈ ప్రక్రియను జూన్ 17వ తేదిలోపు 7661899899 నంబర్‌కు మిస్సుడ్ కాల్ చేసి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. జూన్ 18న పరీక్ష ఉంటుందని, విజేతలకు ఓ స్కూటీ, సెల్‌ఫోన్, ఐపాడ్‌లాంటి బహుమతులు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు యాబద్దీన్, రాములు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం

**మంచాల:** మండలంలోని లోయపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేష్, జెడ్పీటీసీ మర్రి నిత్యరెడ్డి దంపతులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు దండెం రాంరెడ్డి, చిలుక మధుసూదన్‌రెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, రాష్ట్ర నాయకుడు ఈసీ శేఖర్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్, యువజన విభాగం మండల అధ్యక్షుడు భద్రినాథ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.